


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

**నిద్రపట్టటం లేదు హేమంత్‌కు.** నెమ్మదిగా లేచి పై డాబా మీదకు వెళ్ళాడు అతడు. దూరంగా పొగమంచు ముసుగులో మసకగా కనిపిస్తున్న తాజ్‌మహల్‌ను చూస్తున్న హేమంత్ అలికిడికి వెను తిరిగి చూశాడు.

"తాజ్‌ను చూస్తున్నావా?" అంటూ దగ్గరగా వచ్చాడు అభిజిత్.

"డాడ్, నిద్రపోలేదా?" అంటున్న కొడుకును దగ్గరకు తీసుకున్నాడు అతడు.

"రా, ఇలా కూర్చుందాం" అంటూ సగం కట్టి ఆపినట్టు ఉన్న చిన్నగట్టు మీద కూర్చున్నాడు అభిజిత్. నెమ్మదిగా అతడికి దగ్గరగా కూర్చున్న హేమంత్, అతడు డ్రింక్ చేసినట్టూ గమనించాడు.

"హేమంత్, ఏదో బాధగా వుందిరా మనసులో.. కొంచెం తీసుకున్నాను దానిని చల్లబరచాలని. సారీరా" అన్నాడు.

"ఇట్స్ ఓకె డాడ్! చాలా లేటైంది, పడుకుందాం రండి." అతడిని చెయ్యిపట్టి లేపబోయాడు హేమంత్.

"అవును. లేటైంది అని తెలుసు, మరి నువ్వేం చేస్తున్నావ్ ఇక్కడ" అతడి స్వరం స్థాయి పెరిగింది.

"డాడీ ప్లీజ్, మళ్ళీ అమ్మ లేస్తుంది"

"మీ అమ్మ పిచ్చిదిరా పాపం. ఏ ప్రాణినైనా ప్రేమిస్తుందిరా.. సౌదీ నుండి వస్తున్న సమయంలో తను ఒక చిన్న కోరిక కోరిందిరా. ఇంతవరకు మరేదీ కోరలేదు.. చాలా గొప్పదిరా మీ అమ్మ."

"ఏం కోరింది డాడ్?" ఆత్రంగా అడిగాడు హేమంత్.

"ఈ ఏరియాలో ఈ బిల్డింగ్‌ను ఎందుకు కొన్నానో తెలుసా హేమంత్? వసుకు తాజ్‌ను రోజూ చూసే అవకాశం కల్పించాలని.."

"డాడ్.. ప్లీజ్ లేవండి, వెళ్దాం. మంచు కురుస్తుంది" అంటూ లేచిన హేమంత్‌ను చెయ్యి పట్టి దగ్గరకు లాగి మళ్ళీ కూర్చోబెట్టాడతడు.

"ఏదో... మనసుకు కొంచెం బాధగా ఉండి తాగానురా. సారీ.. కాని నేను కాన్షస్‌లోనే వున్నాను."

"నా వల్లేకదా మీకు బాధ?" హేమంత్ కళ్ళు చెమ్మగిల్లాయి.

"నో..నో నా కొడుకు బంగారం రా. వాడిని అనుకుంటే పాపం" హేమంత్ బుగ్గపై ముద్దు పెడుతూ అన్నాడతడు.

"ఒకటి చెప్తాను విను. ప్రతి మనిషీ తాజ్‌ను నిర్మించేటంత చక్రవర్తి కాకపోయినా, తనకున్న గుప్పెడంత గుండెలోనే ఒక గుడిని నిర్మించుకుంటాడురా తన ఆప్తుల కోసం. అందులో నిండే ప్రేమకు అనేక రూపాలు.

"కన్నవారు, తోబుట్టువులు, బిడ్డలు, స్నేహాన్ని అందించే వాళ్ళు, జీవితానికి కొత్త నిర్వచనాన్నిచ్చి బంధాన్ని వేసేవాళ్ళు. ఇలా ఇందరికి పంచుతాం మన ప్రేమను. అదృశ్యంగా వుండే ఆ ఆలయాన్ని దాచుకున్న గుండె నుండి ధమనులు, సిరలుతో ప్రవహించేది ఆ ప్రేమేరా. అదే మన ప్రాణాన్ని నిలుపుతుంది ఒడిదుడుకులలో. అందుకే, అందులో ఏ బంధం స్పందన దూరమైనా గుండె ఆవేదనకు గురై ప్రతిస్పందిస్తుంది."

కళ్ళు ఒత్తుకుంటున్న తండ్రిని చూస్తుంటే గుండె బరువెక్కింది హేమంత్‌కు. మౌనంగా ఉండిపోయాడు.

"హేమంత్, నీకు ఇక్కడ వుండాలని లేదు కదూ?" అతడి మాటలకు  మధ్యలోనే అడ్డు వస్తూ.

"ఇక్కడ్నుంచి వెళ్ళాలని కూడా లేదు డాడ్. నిజం డాడ్ మిమ్మల్ని, అమ్మను విడిచివెళ్ళాలని లేదు. ఈరోజు మీతో వచ్చినందువల్ల ఒక విషయం అర్థమైంది. మిమ్మల్ని నాకంటే ఎక్కువగా ప్రేమించేవాళ్ళు వేల సంఖ్యలో ఉన్నారనీ, నాది కేవలం వేళ్ళమీద లెక్కపెట్టగలిగేంత ప్రేమ మాత్రమేననీ తెలుసుకున్నాను.

"తప్పురా హేమా నీ ఆలోచన. నువ్వు నా కొడుకువి, నా ప్రాణానివి. నా మనసులో నీ స్థానం ప్రత్యేకమైనది, ఎవరితోను దానికి కంపారిజన్ వుండదు."

"నేను మరొకలా అనటంలేదు డాడ్. ఇక్కడే వుందాం అనుకుంటున్నాను. కాని మీరు, మమ్మీ అలుపు ఎరుగని సోల్జర్స్ కదా. ఏ బ్రేక్‌ఫాస్ట్ దగ్గరో, రాత్రి డిన్నర్ దగ్గరో కలుస్తాం అంతే. మళ్ళీ మామూలు పరిస్థితే.  ఒంటరితనంతో ఫైట్ చేసే ఓపిక నా మనసుకు లేదింక. అందుకే వైజాగ్ వెళ్దాం అనే మనసు చెప్తుంది డాడ్."

"హేమా, నీకు వెళ్ళొద్దు అని చెప్పటానికి రాలేదురా, నా మనసులో దాగి వుండి నన్ను బాధిస్తున్న కొన్ని విషయాలు నీకు చెప్పుకోవాలనుందిరా."

"నేను మీరు చెప్పే విషయాలన్నీ పాటిస్తాను. మీరు రమ్మన్నప్పుడు వచ్చి మీ ముందు ఉంటాను. మీరంటే నాకు చాలా గౌరవం, ఇష్టం డాడ్. లవ్‌యూ" అన్నాడు హేమంత్.

"నువ్వు కొన్ని సంవత్సరాలు మాకు దూరంగా వెళ్తున్నావు కదా భవిష్యత్తులో నిర్ణయాలు తీసుకోవటానికి ఉపయోగపడవచ్చని చెప్తున్నాను" కొడుకు చేతిని చేతిలోకి తీసుకున్నాడు అతడు.

"ఇపుడు అవన్నీ గుర్తుకు తెచ్చుకుని, మీ మనసును బాధించుకునే విషయాలైతే ప్లీజ్ మరచిపొండి డాడ్"

"ఇవి ఎప్పటికీ మరపురానివిరా. నా గుండెలో రగులుతూనే ఉండే చేదు జ్ఞాపకాలు" కంపిస్తున్న స్వరం విని తండ్రి ముఖంలోకి చూశాడు హేమంత్. అభిజిత్ దృష్టి ఎక్కడో ఉంది. మౌనంగా ఉండిపోయాడు హేమంత్.

"ఇవన్నీ సుమారు ఇరవై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు. నేను రాజపుత్ర వంశంలో పుట్టినవాడిని. రాజాలాగే పెరిగాను. నాకు కారు రేస్‌లంటే ప్రాణం. కాని అదెంతకాలమో సాగలేదు. నాన్నగారి కోరిక నన్ను డాక్టర్‌ను చేసింది. నాకు ఇద్దరు అన్నయ్యలు, ఒక చెల్లి. వంశపారంపర్యంగా ఉన్న ఆస్తులు లెక్కకు మించి ఉన్నాయి. ప్రాక్టీసు పెట్టాను. నిరుపేదలకు, వృద్ధులకు ఉచితంగా వైద్యం చేసేవాడిని. అది మా అన్నయ్యలకు నచ్చేది కాదు. నా చదువుకు ఖర్చు అయినదంతా రోగులనుంచి వసూలు చెయ్యాలని వేధించేవారు. పేదలపట్ల, పనివారి పట్ల జాలిగాని, దయగాని లేకుండా కర్కశంగా ప్రవర్తించేవారు.

"క్రమంగా నాలో ఒక నిర్లిప్తత చోటు చేసుకుంది. నా ఆదర్శాలు, స్వభావం వారి పాదాల క్రింద నలిగిపోయేవి. ఇక ఇరుకు పెట్టెలో ఊపిరి సలపకుండా బందీ అయిపోయింది నా మనసు. స్వేచ్ఛకోసం దుఃఖించేది.

“ఆ సమయంలో నా మిత్రుడు అజయ్ ఘోష్ నుండి నాకు ఒక లెటర్ వచ్చింది. అతడు బెంగాలీ, నాకు ఆప్తుడు. మెడిసిన్‌లో క్లాస్‌మేట్, రూమ్మేట్ కూడా నాకు. అతడు సౌదీ అరేబియాకు వెళ్ళాడు డాక్టర్‌గా. అక్కడి విషయాలన్నీ వివరంగా రాసాడు. నన్ను కూడా అక్కడికి రమ్మంటూ. అతడూ నాలాంటి భావాలే కలవాడు.

అమ్మను, నాన్నగార్ని ఒప్పించి వెళ్ళగలిగాను అరేబియాకు. కొత్తలో ఒకరకంగా అనిపించినాగాని, అక్కడ వున్న ఇతర ఇండియన్ డాక్టర్లు, అంతకుమించి నా మిత్రుడు అజయ్ ఘోష్, నేను కాస్త అలవాటుపడేవరకు సపోర్ట్ ఇచ్చాడు. అక్కడ ఒక మంచి డాక్టర్‌గా గుర్తింపు పొందాను నేను" ఆగాడు అభిజిత్.

"డాడ్, మీకు పగలు విశ్రాంతి లేదు. రేపు చెప్పండి ప్లీజ్, పడుకుందురుగాని రండి" హేమంత్ లేస్తూ అన్నాడు.

"నీ గురించే ఆలోచిస్తుంటే, నాకు నిద్రపట్టలేదు. నువ్వు మెట్లెక్కి పైకి రావడం చూసే నేను వచ్చాను. ప్లీజ్ హేమంత్, నన్ను చెప్పనియ్యరా. మళ్ళీ అవకాశం వస్తుందో లేదో."

"ప్లీజ్ డాడ్ అలా మాట్లాడకండి. సరే చెప్పండి" అంటూ అతడికి దగ్గరగా కూర్చున్నాడు హేమంత్.

"ఒకటిన్నర సంవత్సరాల తర్వాత సౌదీ నుండి ఇంటికి వెళ్ళాను. అందరూ కూడా సంతోషంగానే కనిపించారు. అందరికోసం గిఫ్ట్‌లు తీసుకెళ్ళాను. అమ్మ అయితే ఇక తిరిగి వెళ్ళొద్దంది. బాధపడింది. అయినా నెమ్మదిగా ఒప్పించాను. పెద్దన్నయ్య విక్రమ్, తన భార్య చెల్లెల్ని పెళ్ళిచేసుకుని అప్పుడు వెళ్ళమన్నాడు. నేను నాన్నగారికి చెప్పాను స్పష్టంగా అప్పుడే పెళ్ళి ప్రసక్తి లేదని. అన్నయ్యలు, వదినల నిష్ఠూరాల మధ్యనుంచి నాన్నగారి వల్ల వెళ్ళగలిగాను తిరిగి.

"అభీని వెళ్ళనివ్వండిరా ఇప్పుడు పెళ్ళి వద్దనేవాడిని బలవంత పెట్టొద్దు" అని చెప్పారు. వాళ్ళింక చేసేది లేక వెనక్కు తగ్గారు.

"అసలు అన్నయ్యల కనుసన్నలలో ఉండటం నావల్ల కాదు. నా వ్యక్తిత్వం నాకు కావాలి. ఇపుడు నువ్వు వైజాగ్‌కు వెళ్ళాలి అనుకున్నట్టే, అపుడు నేను సౌదీకి వెళ్ళిపోయాను.

"అక్కడ పేషెంట్లు, చాలావరకు సంపన్నులే ఉండేవారు. వారు తమకు నయం అయి ఆరోగ్యంగా తిరిగి వెళ్ళే సందర్భాలలో, తమ సంతోషం కొలదీ చాలా పెద్ద మొత్తాలను ఆఫర్ చేసేవారు. మా శాలరీ మాకు చాలు అని, ముందులో వద్దనేవాడిని. కాని దూరదృష్టితో అంగీకరించాను. నా అకౌంట్‌లో ఆ మొత్తాలు అలా నిండుతూనే వుండేవి. ఇప్పుడు మేము చేస్తున్న సేవా కార్యక్రమాలకు అవే పునాదులుగా నిలిచాయి.

"అంతలో అక్కడ అనూహ్యంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. సౌది అరేబియాను బేస్‌గా చేసుకుని పొరుగు దేశాలపై దాడులు మొదలయ్యాయి. ప్రతిదాడులలో సైనికులేకాకుండా, అమాయకులైన ప్రజలు, మాలాంటి విదేశీయులు బలికావటం మొదలైంది. చాలామంది స్వదేశాలకు పరుగు తీశారు. నాన్నగారుకూడా గుమాస్తాతో ఉత్తరం రాయించారు, వెంటనే బయలుదేరి వచ్చేయమని .

'అలాగే' అన్నాను కాని నేను కదలలేదు.

"నా కొలీగ్‌కు ఇండియానుంచి భార్య లెటర్ రాసింది. 'తొందరపడి వచ్చేయొద్దు. యుద్ధం సమయంలో పనిచేస్తే ఎక్కువ డబ్బు వస్తుందట కదా. పిల్లల భవిష్యత్‌కు పనిచేస్తుంది ఆ మొత్తం' అంటూ. భార్య ప్రేమిస్తుంది తనను కాదనీ, డబ్బును అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు అతడు. చాలామంది స్వదేశాలకు వెళ్ళిపోయారు. యుద్ధ తీవ్రత పెరిగిపోయింది. ఉన్న స్టాఫ్ చాలటం లేదు. అన్ని హాస్పిటల్స్ కూడా క్షతగాత్రులతో నిండిపోయాయి.

"మాకు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న హాస్పటల్‌పై మిస్సైల్ దాడి జరిగింది. ఆ దాడిలో పేషెంట్లతో సహా డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది చాలామంది చనిపోయారు.

దానితో అందరం ఏ క్షణాన ఏం జరుగుతుందోనని వణికిపోతున్నాం. అంతలో మరో పిడుగులాంటి హెచ్చరిక. రసాయన ఆయుధ దాడి జరగబోతుందని. అప్పటికే ఆ పేలుతున్న శబ్దాలకు గుండెలు అదిరిపోతున్నాయి. చెవులలో దట్టంగా దూదిని పెట్టుకునే వాళ్ళం. ఆ భీకర శబ్దాలకు చెవులు దెబ్బతినకుండా ఆక్సిజన్ మాస్కులతో తిరిగేవాళ్ళం. పొగ కమ్ముకుని పగలే చీకట్లు ముసురేవి.

వార్ ఫ్రంట్‌కు దగ్గరగా వున్న మా హాస్పిటల్‌కు, దూరపు హాస్పిటల్స్ నుండి డాక్టర్లు, నర్సులు ఆంబులెన్స్‌లలో వచ్చారు. వాహనాలకు పైన చుట్టూ చెట్ల కొమ్మలతో కప్పేవారు.

వచ్చిన వారిలో ఒక నర్సు ప్రాణాలకు తెగించి, సేవలు అందించటం గమనించేవాడిని. చాలా దగ్గరగా వున్న సైనిక శిబిరంపై భారీగా దాడి జరిగింది. మాలో చాలామంది ఇంటిదగ్గర ఆప్తులను తలచుకుని ఒకరినొకరు పట్టుకుని దుఃఖించారు.

నాకు అటువంటి ఫీలింగ్ ఏమీ రాలేదు. ఎందుకంటే కుటుంబంలో నా స్థానం ఖాళీ అయినా ఎవరికీ నష్టంలేదు, తల్లితండ్రులకు కడుపుకోత తప్ప."

కళ్ళు ఒత్తుకుంటున్న తండ్రికి దగ్గరగా జరిగాడు హేమంత్, "డాడ్!" అంటూ. తిరిగి ప్రారంభించాడు అతడు.

"ఆ సమయంలో నాతోపాటు హాస్పిటల్ వెలుపలకు కూడా పరుగులు తీస్తూ గాయపడిన వారిని కాపాడటానికి సిద్ధపడింది ఆ నర్స్. ఆమె, నేను ఇద్దరం కలిసి గాయపడిన వారిని ఎందరినో ప్రాణాలకు తెగించి కాపాడాం. ఆ సమయంలో నేను తీవ్ర అస్వస్థతకు గురయ్యాను. అప్పుడు ఆమె పగలూ రాత్రీ కూడా తన సేవలతో, నన్ను డాక్టర్.. డాక్టర్ అంటూ కంటి రెప్పకంటే  కూడా ఎక్కువగా నన్ను కాపాడింది.

ఆ విషమ పరిస్థితుల్లో ఇద్దరం ఒకరికి ఒకరుగా నిలిచాం. దగ్గరగా జరిగిన బాంబుదాడికి, ఏమైందో తెలియని అయోమయంలో అందరం ఎగిరిపడ్డాం. దట్టంగా కమ్ముకున్న పొగల చీకటిలో ఆమెకోసం పిచ్చివాడిలా వెతికాను. ఆమె అచేతనంగా పడివుంది. నా గుండె బాధగా మూలిగింది. ఆమెను నా చేతులతో ఎత్తి హాస్పిటల్‌లోనికి తీసుకెళ్ళాను. రెండు రోజులు ఆమె స్పృహలోకి రాలేదు" ఆగాడతడు.

తండ్రి స్వరం కంపించటం గమనించిన హేమంత్, అతడి చేతిపై చెయ్యివేశాడు.

"ఆమె కోసం పసివాడిలా దుఃఖించాను. కాపాడమని దేవుడిని పదే పదే అడిగాను. 'వసూ..వసూ ' అంటూ బిగ్గరగా రోదించాను. అప్పుడు అర్థమైంది నా మనసుకు, ఆమెను నా గుండెలో దాచుకున్నానని. మూడవరోజు ఆమె స్పృహలోకి వచ్చింది. ఆమెను లేవనెత్తి గుండెకు హత్తుకున్నాను. ఆమెకూడా నా చేతులలో ఒదిగిపోయి 'డాక్టర్..డాక్టర్ ' అంటూ దుఃఖించింది.

"ఆ క్షణం నుంచి ఇద్దరం, జీవించినా మరణించినా సరే ఒకటిగానే ఉందాం అన్నట్టు ప్రాణాలకు తెగించి మరింతగా పెంచాం మా సేవలను.

భూమి దద్దరిల్లుతున్న ఆయుధాల మోతలే మాకు మంగళ వాద్యాలయ్యాయి. చనిపోగా మిగిలిన మా కొలీగ్స్, క్షతగాత్రులుగా  మా సేవలతో కోలుకుంటున్న సైనికుల సమక్షంలో నా మెళ్ళో  ఉన్న చిన్న లాకెట్ చెయిన్‌ను ఆమె మెళ్ళో వేసి నాదాన్ని చేసుకున్నాను ఆమెను.

'ఈ సంతోషాన్ని పంచుకోవటానికే బ్రతికాను మీ సేవలతో' అంటూ నా పాదాలను తాకి తలపై వుంచుకుంది ఆమె.

ఆమెలో ఒక ఫ్లారెన్స్ నైటింగేల్‌ను, ఒక మదర్ థెరిసాను చూశాను. వృత్తిపట్ల ఆమె అంకిత భావానికి, ఆమె సేవలలో ప్రతిబింబించే మానవత్వానికి ముగ్ధుడనైన నేను వ్యక్తిగానే కాకుండా, ఒక డాక్టర్‌గా తల వంచాను" ఆగాడతడు.

హేమంత్‌ను దగ్గరకు తీసుకుని తలనిమిరాడు అభిజీత్.

"ఆమే నీ అమ్మరా హేమంత్. ఆమె కడుపున పుట్టిన నువ్వు ధన్యుడివిరా హేమంత్" అంటూ కొడుకును గుండెకు హత్తుకున్నాడు అతడు.

"ఆయాం ప్రౌడ్ ఆఫ్ మై పేరెంట్స్ డాడ్" అంటూ చెమ్మగిల్లిన కళ్ళతో తండ్రిని చుట్టేసుకున్నాడు హేమంత్.

"హేమా, నాకు ఎవరూ తోబుట్టువులు, ఫ్యామిలీ మెంబర్స్ లేరా? అని అడిగావు గుర్తుందా? నీ తండ్రిగా నీకు జవాబు చెప్పవలసిన బాధ్యత నాకు ఉంది."

"ప్లీజ్, ఇప్పుడు వద్దు డాడ్, నాకు ఎవరూ కంపెనీ లేరన్న బాధతో అడిగాను. సారీ డాడ్. లేవండి పడుకుందాం" అంటూ లేచిన హేమంత్ చెయ్యిపట్టీలాగి పక్కన కూర్చోబెట్టుకున్నాడు అభిజీత్.

"విను హేమంత్. ప్లీజ్ నీకు చెపితే నా గుండె బరువు కాస్త తగ్గుతుంది. ఇన్నేళ్ళూ నివురు గప్పిన నిప్పులా నా మనసును దహిస్తున్న గుండె మంటలు ఆరతాయి."

తండ్రి మాటలలో వినిపిస్తున్న మనోవ్యధ హేమంత్ మనసును తాకుతుంది.

"చెప్పండి డాడ్" అంటూ మరింత దగ్గరగా జరిగాడు హేమంత్.

"వేలాదిమందిని వికలాంగులుగా మార్చి, వేలవేల మందిని బలితీసుకున్న యుద్ధం క్రమక్రమంగా సమసిపోయింది. కాని .. కాని అది మిగిల్చిన భీకర ఛాయలు మాత్రం అలాగే ఉన్నాయి.

ఎటు చూసినా గుట్టలుగా ఉన్న శవాలు, జంతువుల కళేబరాలతో కడుపులో దేవుతుంది. దేవుడు బ్రతకమని ఇచ్చిన గాలి, నీరు, ఆకాశం, భూమి కాలుష్యంతో కళ తప్పాయి. చావగా మిగిలిన వాళ్ళకు ఆహార కొరత, తాగునీటి కొరత, మందుల కొరత ఏర్పడ్డాయి.

ధ్వంసమైన యుద్ధవాహనాలు, సముద్రతీరం నుంచి కంటికి కనిపించినంత వరకు నీరు నల్లగా మారిపోయింది. అలల వేగానికి పెద్ద, చిన్న జలచరాల కళేబరాలు ఒడ్డుకు వచ్చి చేరుతున్నాయి. యుద్ధ సమయంలో సముద్రంలో నిలిచిపోయిన క్రూడ్ ఆయిల్ షిప్, మిస్సైల్ దాడికి గురై పగిలిపోయింది. ఫలితంగా ఏ పాపం ఎరగని సముద్ర జీవులు భారీ సంఖ్యలో బలి అయిపోయాయి. సముద్ర తీరానికి దూరంగా ఉన్నాగాని, ఆ దుర్వాసనలు ఒక పక్క, కుప్పకూలిన భవనాల క్రిం కుళ్ళిన శవాల దుర్వాసనలు ఒక పక్క, అత్యంత ప్రమాదకరంగా, భయానకంగా ఉంది పరిస్థితి. సహాయక చర్యలకోసం అక్కడే జీవచ్ఛవాలలా ఎదురుచూస్తు కొన ప్రాణాలతో మిగిలాం.

"నెమ్మదిగా విమాన సర్వీసులను పునరుద్ధరించారు. ఇండియన్ ఎంబసీ తెరుచుకోవటంతో భారతీయులందరూ అక్కడకు పరుగుతీస్తున్నారు. నేను కూడా అధికారులతో సంప్రదిస్తూ స్వదేశానికి వెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నాను. అపుడు 'మనం, ఎపుడు ఇండియాకు వెళ్ళగలం డాక్టర్?' అని కళ్ళనీళ్ళతో అడిగింది వసు, అదే మీ అమ్మ. తనవాళ్ళ గురించిన భాధ, ఆందోళన మొదలింది ఆమె మనసులో.

"ప్రయత్నం చేస్తున్నాననీ, చాలా రష్‌గా ఉండటం వల్ల ప్రయారిటీని బట్టి అవకాశం రాగనే వెళ్దాం" అంటూ ఆమెకు ధైర్యాన్నిచ్చేవాడిని.

'పాపం నా చెల్లెలు, తమ్ముడు, నేను ఏమయ్యానో కూడా తెలియక నాకోసం తపిస్తూ వుంటారు' అంటూ కళ్ళు ఒత్తుకుంది, వేరే చెయ్యగలిగింది కూడా ఏమీలేదింక.

టెలీకమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయింది. ఎక్కడివాళ్ళం అక్కడే. నా మనసులో అమ్మా, నాన్నగారు చెల్లి అన్నయ్యలూ మెదిలారు.

సూట్‌కేస్‌లను సర్దుతున్న వసు 'మనం ఢిల్లీలో దిగగానే మీరు జైపూర్‌కు వెళ్ళండి డాక్టర్. నేను వైజాగ్ వెళ్తాను. కొంచెం ఆగి పరిస్థితులను బట్టి మళ్ళీ కలుసుకుందాం' అంది.

షాక్ అయ్యాను నేను. 'ఎందుకు వసూ?' అన్నాను అప్రయత్నంగా. నా ముఖంలో భావాన్ని గ్రహించిన వసు 'వర్రీ అవకండి డాక్టర్. త్వరలోనే మళ్ళీ కలుద్దాం' ఎవరి లగేజ్ వాళ్ళకు విడివిడిగా సర్దుతూ చెప్పింది. మౌనంగా వుండిపోయాను. అనుక్షణం తోడుగా వుంటూ 'డాక్టర్..డాక్టర్' అని పిలిచే ఆమె పిలుపు నా గుండె చప్పుడుగా మారింది నాకు.

"ఇప్పటికీ మీ అమ్మ నన్ను చాలావరకు 'డాక్టర్' అనే పిలుస్తుందిరా" ఆగాడు అభిజిత్.

"అవును డాడ్" అంటూ అతడి గుండెపై తలపెట్టుకున్న హేమంత్ కళ్ళు తెలియని ఒక బాధతో సజలాలయ్యాయి.

తండ్రి మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్న హేమంత్‌కు, తన తల్లి తండ్రులు ఎదురొన్న కష్టాలను తలచుకుని మనసు పిండినట్లైంది.

"ఇండియాకు ఎప్పుడు రాగలిగారు డాడ్?" ఆత్రంగా అడిగాడు.

"యుద్ధం తర్వాత సౌదీ అరేబియా నుండి స్వదేశానికి వస్తున్న విమానాలలో వస్తున్న తమ ఆప్తులకోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కిటకిటలాడుతుంది. అలా ఇండియాకు వచ్చిన మూడవ విమానం ఢిల్లీ ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో లాండ్ అయింది. ఆ ఫీలింగ్ మాటలలో చెప్పలేనురా హేమా!" గద్గదమైంది అతడి స్వరం.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS